# అంకితము

"Don't care for the world. Go ahead as your will says."

అరటి పండిస్తే మంచివాడంటారు. ఇవ్వకుంటే పిసనారి అంటారు. వీళ్ళ నేంది మనం లెక్క చేసేది" అని నా జీవితాంతము అత్యంత ఉపయోగ కరమైన సందేశము నాకనుగ్రహించిన పూజ్యపాదులు శ్రీ సుధీంద్రబాబు (పాలంగి) గారి పాదపద్మములకు, వారి ఆశ్శీస్సుల కొరకు పంపిన ఆచార్య శ్రీ భరద్వాజమాష్టరు గారి దివ్యపాదారవిందములకు- ఇంతటి పవిత్ర సేవ చేసుకొనే అవకాశము, పరిస్థితులు కల్పించిన శ్రీ సాయి నాధులు మరియు శ్రీ వెంకయ్యస్వామి వారి దివ్య పాదారవిందములకు, ఇన్ని రూపాలలో ప్రకటమైన ఆది గురువు శ్రీ దత్త స్వామి వారి దివ్య చరణారవిందములకు సమర్పిస్తున్నాను.


## శ్రీ స్వామి కృప పబ్లికేషన్స్ వారి ఇతర ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| 1. | అవధూత లీల | - | 40రూ |
| 2. | అవధూత బోధామృతము | - | 15రూ |
| 3. | స్వామి సన్నిది | - | 15రూ |
| 4. | అవధూత లీల ఇంగ్లీషు | - | 30రూ |
| 5. | శ్రీ వెంకయ్య స్వామి ఇంగ్లీషు | - | 3రూ |
| 6. | స్వామి కృప | - | 1-50 |
| 7. | దివ్య లీలలు | - | 1-00 |
| 8. | పిలిచిన పలికే దైవం | - | 1రూ |
| 9. | ధర్మమూర్తి | - | 1రూ |
| 10. | వెన్నెల పూలు | - | 1రూ |
| 11. | బోధయజ్ఞాయ నమః | - | 1రూ |
| 12. | వార్తా లాపం | - | 150రూ |

శివరాం ప్రోన్: 323519

# మౌన బోధ

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి దివ్య బోధ



ఈ పుస్తకము శ్రీ పెసల పెంచలయ్య గారు వారి సతీమణి ఆదిశేషమ్మ గారు - స్టోన్ హౌస్ పేట - నెల్లూరు వారి ఆర్థిక సహాయముతో ప్రచురించడమైనది.

రచన : పెసల సుబ్బరామయ్య

*వెల ఒక్క రూపాయి*

# శ్రీ స్వామి వారి జీవితం

శ్రీ స్వామి వారు నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకా నాగుల వెల్లటూరు అను గ్రామములో సోంపల్లి పిచ్చమ్మ, పెంచలయ్య అను పుణ్యదంపతులకు జ్యేష్ఠపుత్రుడుగా జన్మించారు. వీరు కేవలం దీనజనోదరణ కొరకు, భక్తపాలన చేయుటకు మానవావతారందాల్చిన పరతత్వం మాత్రమేనని వారి దివ్యలీలలు తెలుపుచున్నవి. ఇంతేకాక శ్రీ స్వామివారు ఒకప్పుడు "అయ్యా అందరిలాగా సోంపల్లి పిచ్చమ్మకు, పెంచలయ్యకు కలిగాననుకున్నారా?" అన్నారు. అంటే నా జన్మ దివ్యజన్మ నా కర్మ దివ్య కర్మలు అని తెలిపారు. అంతేగాక శ్రీ స్వామి వారికి కాళ్ళు పటుకపోయినప్పుడు వైద్యం చేయించుకోమంటే "అబ్బో! అటాగయితే మనమొచ్చిన పని నిలిచిపోతుండ్లా" అన్నారు. తానొక దివ్యమైన అవతార కార్యం నిమిత్తం అవతరించామని చెప్పారన్నమాట. మీకు గురువెవరు స్వామి అంటే "నీ వెరుగవు లేయ్యా. సముద్రాల మీద ఈ చూపుకు అడ్డేలేదు. నీవేది కోరుకుంటే అది వస్తుంది. మరలా గురువెందుకు నానెత్తిన" అన్నారు. అంతేగాక వారి చిన్ననాటి నుండి కూడా దివ్యమైన శక్తి సామర్థ్యాలు గలిగిఉండే వారని ఆధారములున్నవి. వీరు చిన్ననాటి నుండి సర్వజ్ఞులు! వీరి చెల్లెలు శ్రీ స్వామి వారు పిచ్చోడని ఒకనాడు మనస్సులో అనుమానించింది. వెంటనే సర్వజ్ఞుడైన శ్రీ స్వామి వారు "ఏమమ్మా నిన్ను చెట్టుకో పుట్టకో వదిలి పెట్టి పోయేటంతటి పిచ్చోణ్ణి కాదులేమ్మా అని సెలవిచ్చారు. వీటన్నింటిని బట్టి శ్రీ స్వామివారు, అవతార కార్యార్థమై వచ్చిన పరతత్వమేనని నిస్సంశయంగా చెప్పవచ్చును.

చిన్ననాటి నుండి ధర్మాత్ముడని ప్రతీతి. తన ఈడు పిల్లలకు తగాదాలు వచ్చినపుడు తీర్పు చెప్పమని శ్రీ స్వామి వారికి నివేదించేవారు. అబదమాడటం అసలు గిటదు. భూతదయ గలవాడు. ఎండుటాకులు తినే పశువులను చూస్తే తననెత్తిమీద ఇంటికితెస్తున్న గడ్డిమోపు వాటికి వేసి వట్టి చేతులతో ఇల్లు చేరేవాడు. గనుకనే పిచ్చి వెంకయ్య అనే సార్థకనామధేయుడై వెలుగొందాడు. చిన్ననాటి నుండి అందరు పిల్లలవలె ఇరవై సంవత్సరముల వయస్సు వరకు సేద్యపు పనులు అమిత చక్కగా చేస్తూ అందరి మన్ననలు పొందారు.

ఇరవయ్యవ ఏట జ్వరమొచ్చి ఒక వారం మంచాన పడ్డారు. తల్లిదండ్రులతో మన ఇల్లు వేలం వేయబోతున్నారు. మీరెటా చేస్తారని అడిగారు. నిజానికి వారు తీర్చవలసిన బాకీలేమీ లేవు. గనుక జ్వర తొందర వలన మతి భ్రమించిందని నిమ్మకాయ రసం తలంటి స్నానం చేయించడమే గాకుండా ఆకుపసరులు వగైరా అంటి తలపై నీళ్ళు పోశారు. భూత వైద్యాలు చేయించారు. కొన్నాళ్ళు స్థంభానికి కట్టేసి కూడా వైద్యాలు చేయించారు. కాని ఏమీ మార్పులేదు. అలా కటివేయడం ఇష్టం లేక వాళ్ళ తల్లిగారు కట్లు విప్పి వదిలేశారు. చాకలీయోగం, మంగలియోగం, డుబుడుక్ డుబుడుక్ అని అరుస్తూ వీధుల వెంట పరుగులు తీస్తూ సమీపమందలి తోటలలోను అడవిలోను నిర్విరామంగా పరుగెత్తుతుండేవారు. అడవిలో తిరిగేటప్పుడు గుడ్డలన్నీ కంపకు తగుల్కొని చినిగి పోయేవి. వారి తల్లిగారు క్రొత్తబట్టలు తెచ్చి ఇంట్లో పెడితే ఎప్పుడో వచ్చి అవి ధరించి వెళ్ళిపోయేవారు. కూలి వాళ్ళచేత అన్నం మూటపంపి అడవిలో వెతికించేవారు. అన్నం మూట చూస్తే గుట్టుగా ఇంటికి వచ్చేవారు. అన్నం పెడితే తివి మరలా పరుగులు తీసేవారు. హరిజనులు దోసిట్లో అన్నం తింటుంటే ఆ ఎంగిలి అన్నాన్ని తీసుకొని తింటూ వెళ్ళిపోయేవారు. చాకలి వాళ్ళ గంపలో నుండి కూడ అలాగే అన్నం తీసుకునేవారు. కానీ వయసులో ఉన్న ఆడవాళ్ళు కంటబడితే పులిని చూచి భయపడిపరిగెత్తునట్లు దూరంగా వెళ్ళేవారు. ఈ కాలంలోనే పిచ్చి వెంకయ్య అనే బిరుదు పొందారు.

ఈ విధంగా వీధులెంబడి పరుగెత్తే పిచ్చి వెంకయ్య అకస్మాత్తుగా ఎవ్వరికంట బడకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు. తల్లిదండ్రులొక వారం పరిసరాల్లో వెతుక్కొని ఆశ వదిలేసుకున్నారు. అలా అంతరానమైన మహనీయుడు కొన్ని సంవత్సరముల తరువాత తిరిగి పరిసర గ్రామాలలో వెంకయ్యస్వామి వారు అనే బిరుదుతో ప్రత్యక్షమయ్యారు. వైద్యుల కలవిగాని వ్యాధులు నయం చేయడం, పశువుల వ్యాధులు నయం చేయడం, ప్రశ్నలు చెప్పడం వలన

అందరూ వెంకయ్యస్వామి అని వారిని ఎంతో పూజ్యభావంతో పిలిచేవారు.

ఎప్పుడూ తన చెంత అగ్నిని ఏమారకుండా ఉంచుకొనేవారు. కపిల మోకు ముక్కలు మోపుగట్టి నెత్తినబెట్టుకొని ఒక ముక్కకు నిప్పంటించి ఒక చేతబట్టుకొని ఒక ముంత, పంగాలు కర్ర మరొకచేత ధరించి పెన్నానది వెంబడి అడవులలోను, గ్రామాలలోని ఏకాంత ప్రదేశాలలో నిర్విరామంగా తిరుగుతుండేవారు. ఎప్పుడో ఆకలైనప్పుడు ఒక్కరింటిలో మాత్రం అన్నం పెట్టించుకొని తిని వెళ్ళి పోయేవారు. వారి కీర్తి నలువైపుల అన్ని గ్రామాలకు వ్యాపించింది. అందరూ భక్తిభావంతో వారిరాకకై ఎదురుచూచేవారే. కానీ వారెవ్వరికీ దొరకరు. పశువులలో జబ్బులు వస్తే ఆరోజులలో మందలు మందలుగా చనిపోయేవి. కలరా, మశూచి వస్తే గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకపోయేవి. అలాంటి విపత్కర పరిస్థితులలో ఆయా గ్రామస్తులు వారు తిరిగే ప్రాంతాలలో వెతికి వారిని కలుసుకొని తమకష్టాలు విన్నవించుకుంటే, వారు ప్రసాదించే దారం, సాంబ్రాణే శ్రీ రామ రక్షయై ఒక్క ప్రాణి కూడా మరణించకుండా కాపాడేవి. కానీ దురదృష్టమేమంటే ఎవరో ఎరుకలయ్య, సుబ్బన్న వంటి గొప్ప యోగులు దప్ప మిగిలినవారు వారి స్థితిని గుర్తించలేకపోయారు. వారి దృష్టిలో చక్కగా ప్రశ్నలు చెప్పి జబ్బులు నయం చేసే స్వామి మాత్రమే.

పెన్న బద్వేలు తిప్పమీద ఒక గుడిశ వేసుకొని నూనె దీపం వెలిగించి రాత్రింబవళ్ళు తంబుర మీటుతుండేవారు. చలమానాయుడనే సేవకుడు పరిసర గ్రామాలలో బిక్షాన్నం తెచ్చేవాడు. కొన్నాళ్ళు కోటితీర్థ దేవాలయంలో అగ్ని గుండం వేస్తూ "ఓం నారాయణ ఆదినారాయణ" అనే మహామంత్రాన్ని జపిస్తూ రెండుచేతులలోని ఈతపుల్లలతో తంబుర మీటుతూ నామంలో లీనమై తీగలు తెగిపోయినా విషయం కూడా గమనించక ఈత పుల్లలు ఆడిస్తూ వుండేవారు. ఎప్పుడో స్పృహవచ్చినపుడు తీగలు ముడేసుకొనేవారు.

కొన్ని సంవత్సరాలు పెన్న నీటికి ఇసుకతో కట్టలు వేసి నీటి ప్రవాహాన్ని ఆపివేసేవారు. తన దర్శనార్థం వచ్చిన వాళ్ళను గూడా దేవుని పని చెయ్యండయ్యా అని ఇసుక పోయించేవారు. నిరంతరం నీటిలో నానుతున్నందున కాళ్ళు భయంకరంగా పాచి వుండేవి. మనమయితే అలాంటి పాచిన కాళ్ళతో ఒక్క అడుగు కూడా పెట్టలేము. అలా నిలిచిన నీటిని కాలువ తీసి పెన్న ప్రవాహానికి కొంతదూరం ఎదురుపారించి నీటిలో కలిపేవారు. కాలువ నీరు నిలబడ్డనీటిలో కలిసే చోట నీటిపై వెల్లువ తుక్కువేసి మంటబెట్టి ముంతతో నీరు తీసుకొని మంటకిరువైపులా తిరగబోస్తుండేవారు. ఎందుకు స్వామి ఇదంతా అంటే "పెద్దమ్మవారు, కలరా, జబ్బులు రాకుండా ఉండేందుకు. ఈ నీటి విలువెంతో తెలుసా! తులం మూడుకోట్లు. ఈరోజు మన పనివలన లోకంలో ఖర్చులన్నీ పోను, ఇంకా పదికోట్లు మిగిలింది" అని సెలవిచ్చేవారు.

శ్రీ స్వామి వారు తన అవతార కార్యార్థమై గ్రామాలలో పర్యటించేవారు. ఏనాడు గృహస్తుల ఇండ్లలో ఉండేవారుకాదు. గ్రామచావడి, దేవాలయం, చెట్లనీడన విడిదిచేసేవారు. ఒకవేళ భక్తుల ఇండ్లకుపోతే బయటవరండాలోనో, కొట్టం లోనో ఉండేవారు. వర్షం వస్తే తన సేవకులందరిని ఇంట్లోకి పంపి వారుమాత్రం చూరుక్రిందయినా పడుక్కుంటారు. అరుదుగా శ్రీస్వామి ఎవరింటికైనా వచ్చి అగ్నిగుండం వేశారంటే వారు చాలా అదృష్టవంతులే. వారికి ఒక గిన్నెతో అన్నంతెచ్చి విస్తట్లో కుమ్మరించాలి. గరిటతో కొద్దికొద్దిగా వడ్డిస్తే ఒప్పుకోరు. అన్నానికి తన కుడి అరచేయి తాకించి ఆశీర్వదించి ఆ ఇంటి వారికి ప్రసాదంగా ఇచ్చేవారు. మరలా అదేవిధంగా మరొక గిన్నెతో వడ్డిస్తే ఆ అన్నాన్ని విస్తరిచుట్టూ ముద్దలు చేసి వదిలేసేవారు. తరువాత వడ్డిస్తే మధ్యలో కారం ఎక్కువగా వేయించుకొని కలుపుకొని తినేవారు. తెల్లగడ్డలు వేసి దంచిన యర్రకారం, ధనియాలపొడి, కరేపాకు పొడి మొదలగు వాటిని ఇష్టంతో తినేవారు. రాగి సంకటి అంటే ఎంతో ప్రీతిగా భోంచేసేవారు. అందులోకి అనుపాకం, తెలగడ్డవేసి దంచిన ఎర్రకారం దండిగా వేయించుకొనేవారు. మనమయితే అందులో 10 వ వంతు కారం భరించలేము. స్నానం చేసేటప్పుడు నీటి యొక్క వేడి కూడా అంతే. మనం చెంబుతో ముంచి పోయలేనంత వేడినీళ్ళయితే అద్దీ అద్దీ అంటు హాయిగా స్నానం

చేసేవారు. ఏమాత్రం ఒక్క డిగ్రీ వేడి తగ్గినా అబ్బోచలి, అని గోలచేసేవారు. స్వామివారు నడిచే రోజులలో నది, కోనేరు, బావి, శుభ్రమైన నీటిగుంటలలో స్నానంచేసేవారు. కొన్ని కొన్ని బావులలో వున్న నీరు వాడకమునకు పనికిరాకుండా పురుగులు వాసనతో ఉండేవి. మరికొన్నింటిలో వేసవికాలంలో నీరుండవు. అలాంటి నిరుపయోగమైన బావులలో శ్రీ స్వామివారు ఒక్క పర్యాయము మునిగి స్నానంచేసి వచ్చారంటే ఇక ఆ పురుగులు, వాసన ఎట్లాపోతాయో తెలియదు. వేసవికాలంలో కూడ తరుగులేకుండా నీరుండేది, ప్రస్తుతం గొలగమూడి కోనేరులో కూడా శ్రీ స్వామివారు అనేక మార్లు మునిగి స్నానం చేశారు. ఇందులోని నీరు మనకు శ్రీ స్వామి వారి పాద తీర్థంతో సమానంగా పరమ పవిత్రమైనది.

ఇదే విధంగా శ్రీ స్వామివారి సమాధి మందిరానికెదురుగా ఉన్న బావికి శ్రీ స్వామివారు స్వహస్తములతో శంకుస్థాపన చేసి మొదట పదిగంపల మట్టి త్రవ్విపోసి తరువాత తన బృందాన్ని త్రవ్వమని ఆశీర్వదించారు. ఎంతటి వేసవిలోనైనా మనమెన్ని నీళ్ళు తోడితే అన్ని నీళ్ళు మరుక్షణంలో బావిలో ఊరుతుండడం కేవలం శ్రీ స్వామి వారి కృపమాత్రమే. ప్రస్తుతం సమాధి మందిర ప్రాంతంలో ఒక్కరోజు కూడా విడవకుండా ఒకప్పుడు ఎనిమిది సంవత్సరములు తమ నిరతాగ్ని హోత్రాన్ని కొనసాగించారు. అప్పుడే సమీపమందలి బ్రహ్మాండమైన అడవంతా సంపూర్ణంగా హరించుకుపోయింది. "ఈ ప్రదేశమంతా చిన్నచిన్న పంటలు పండుతాయయ్యా" అన్న మాటలు ఈనాడు అక్షరాలా నిజమైనాయి.

శ్రీ స్వామి వారు ఒక వైపు తన నిరతాగ్ని గుండాన్ని కొనసాగిస్తూనే మరొకవైపు గంటల తరబడి కాగితాలపై సిరాతో బొటనవ్రేలి ముద్రలు ప్రతినిత్యము వేసేవారు. "అయ్యా ఈ కాగితాలు దాచి పెట్టుకోండి. రాబోయే కాలంలో ఇవి వేల విలువ చేస్తాయి" అని చెప్పారు. ఇదేవిధంగా గంటలతరబడి మనకర్థంకాని బాషలో వారు చెప్పే మాటలన్ని రీములకొలది కాగితాలపై వ్రాయించి ఇచ్చేవారు. ఒకప్పుడు తన సేవకుల భూత భవిష్యత్ వర్తమానాలను గూర్చి చెప్పేవారు. మరొకప్పుడు దేశంలో జరుగబోయే విషయాలు చెప్పేవారు. ఉదా. "తెడుతగలని అన్నం తినే రోజులొస్తాయి" అన్నారు. నేడు ప్రెషర్ కుక్కర్లలో వంటకు తెడ్డు తగిలే ప్రసక్తి లేదుకదా! మరొకప్పుడు ప్రపంచ నడవడులు, పోకడలు గూర్చి చెప్పేవారు. ఆధ్యాత్మిక విషయాలు కూడా ఈ పరిభాషలోనే చెప్పి వారి ఆశీస్సులు వ్రాయించేవారు.

ఆశ్రమ ప్రదేశాన్ని చూపిస్తూ శ్రీ స్వామి "ఇక్కడ పద్నాలుగు గతాల నుండి అన్నం రాసులు రాసులుగా పొగలెగురుతుంది. వేలు పెట్టినవాడేడి? వెంకయ్యచాటుకు పోయిన మూడు సంవత్సరాలకు ఇక్కడ నెల్లూరు రంగనాయకుల గరుడసేవ జరిగినట్లు జరుగుతుందని" సెలవిచ్చారు. అంటే ఈ ప్రదేశం పద్నాలుగు గతాల నుండి అనేక మంది మహాత్ముల తపోశక్తితో నిండియున్న పవిత్ర భూమన్నమాట. అందుకే నేడు ఈ పవిత్ర భూమిలో అడుగుపెట్టి కొందరు వ్యాధి గ్రస్తులు ఎలాంటి సాధనలు చేయకుండానే తమ బాధల నుండి నివృత్తి పొందుచున్నారు. వర్షాలేక పశువులు మేతకు నీటికి బాధపడుతుంటే శ్రీ స్వామి తన యోగశక్తితో ఎన్నిమార్లు వర్షం కురిపించారో లెక్కచెప్పలేము. ప్రపంచము తలక్రిందులైనా తన నియమం తప్పేవారుకాదు. గోనె సంచులు అల్యూమినియం దబరలు, తాటాకు చాపలు తప్ప విలువైన వస్తువులు వాడేవారుకారు. ఒకప్పుడు శ్రీ స్వామివారి కాళ్ళు పట్టుకపోయి నడవలేకపోయారు. తాటాకు మీద కూర్చొని రోశిరెడ్డిచేత లాగించుకునేవారు. ఈ శ్రమ చూడలేక తలుపూరు సుందరరామిరెడ్డి ఆరంగుళముల ఎత్తుగల కొయ్య చక్రాలబండి చేయించారు. డోలీలో తీసుకుపోతే స్వామికి కుదుపులేకుండా వుంటుందని డోలీలో మోసేవారు. కుష్టు, బొల్లి, ఆయాసాలతో బాధపడేవారికొరకు అనేక పర్యాయాలు వారి వ్యాధులు శ్రీ స్వామివారే అనుభవించారు.

1. ఓర్పు : భూదేవి కంటే మించిన సహజ సిద్ధమైన ఓర్పుగలవారు. ఒక దుండగుడు స్వామివారిని చెంపమీద ఒక దెబ్బ కొట్టినప్పుడు కూడా నోరువిప్పి ఒక్కమాట అని ఎరుగరు.
2. పచ్చి తాగుబోతులను సాత్వికులుగా చేయడంకంటే లోక

కళ్యాణమేముంది. కట్టుకున్న భార్యలను వదలి పరస్త్రీల పంచన పడియున్న మగధీరుల మనసు మార్చి వారి కాపురాలు నిలబెట్టడం కంటే ప్రజా శ్రేయస్సేమి కావాలి.

3. ఈ మహనీయుని ప్రేమతత్వాన్ని గూర్చి వ్రాయుటకు నావంటి అల్పజ్ఞునకు సాధ్యమా! లోక కళ్యాణమే తన అవతార కార్యంగా గల ఈ మహనీయుని కొన్ని మౌనబోధలు చూద్దాం.

## మౌన బోధ

శ్రీ స్వామి వారి కృప పొందే మార్గమేమిటని అనేకులు నన్నడుగు తుంటారు. శ్రీ స్వామి వారే ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పియున్నారు. "చూచినేర్చుకో" మన్నారు. ఎక్కడో చూచి నేర్చుకునేదానికంటే వారినే చూచినేర్చుకోవడం ఉత్తమమైన మార్గం. చనిపోయిన వారిని బ్రతికించే స్థితిలో శ్రీ స్వామివారున్నారు. వారు పరమాత్మతో నిరంతరం ఐక్యమై యున్నారు. వారు తనకొరకుగా ఎలాంటి సాధనలూ చేయనక్కరలేదు. కాని వారు లోకం కొరకు, తనను ఆశ్రయించిన భక్తుల కొరకు నిరంతరం రాత్రి పగలు అనే భేదం లేకుండా, ఎండ, వాన అనే విచక్షణ లేకుండా తన నిరతాగ్నిహోత్రాన్ని సాగించారు. ఆ అగ్ని ద్వారా తన నాశ్రయించిన భక్తుల పాపాలు దగమొనర్చు చున్నారు. మే నెలలో ఎండలకు భయపడి మనం నీడకు పరుగెత్తే కాలంలో వారు భయంకరమైన అగ్ని ముందు కూర్చొని ఏ అచ్ఛాదన లేని ఎండలో కౌపీనం (గోచి) మాత్రమే ధరించి అగ్ని హోత్రం సాగించారు. ఎవరికొరకు? ఆ శ్రమంతా సాటి జీవులకొరకు మాత్రమే. ఇదే మనం వారిని చూచి నేర్చుకోవలసిన ఉత్తమమైన బోధ. గురువును తెలుసుకోవాలి. ఎందుకొచ్చినట్లు పిడకలేరు కోడానికా? అంటారు శ్రీసాయి. పిడకలేరు కోవడమంటే ఆస్తిపాస్తులు ప్రోగుచేసుకోవడం, అవన్నీ చివరకు మన దహన సంస్కారానికి వాడే పిడకలకొరకే గదా! గురువును తెలుసుకోవడమంటే ఏమిటి? ఆ మహనీయుడు ఆచరించి చూపిన దివ్య మార్గములో నడవడమన్నమాట.

సత్యం ధర్మం తప్పవద్దు. సాధారణత్వం సద్గురు సేవ సాధించు అన్నారు. ఇవి తప్పినాక మనకెంత ఐశ్వర్యమున్నా, లోకం దృష్టిలో మన మెంత గొప్ప వారమైన శ్రీ స్వామి వారి దృష్టిలో మాత్రం మనం చాలా హీనాతిహీనులమే.

అయితే సత్యం, ధర్మం తప్పిన వారిని కూడా శ్రీ స్వామి వారు ఆదరిస్తున్నారు గదా! అని మీరు అడగవచ్చు. తనయందు విశ్వాసం గలిగి వారు సన్మార్గములోనికి మారుతారని శ్రీ స్వామి వారు అట్టి అధర్మ పరులకు కూడా సహాయం చేస్తున్నారు. వారిలో ఎలాంటి మార్పుకూడా రాకపోతే "పోయేవాళ్ళను పోనిచ్చేదే గదయ్యా" అన్న శ్రీ స్వామి వారి ఆదేశం అక్షరాలా సత్యమైతీరుతుంది.

శ్రీ స్వామి వారి జీవితకాలమంతటిలో వారు ఏ ఒక్క వ్యక్తిని గూడ మంచివాడని గాని, చెడ్డవాడనిగాని విమర్శనాపద్ధతిలో ఒక్కమాటకూడా అని ఎరుగరు. అంతేకాదు ఆహార పదార్థాల విషయంలోగాని, సౌకర్యాల విషయంలోగాని, భక్తి శ్రద్ధల విషయంలోగాని ఎలాంటి విమర్శలూ చేసి ఎరుగరు. ఇది సాధకులకే గాక సంసారులకు గూడా అనుక్షణము గుర్తుంచుకోవలసిన విషయము. ఈ విషయాన్ని మనం పాటించనందున నోటితో చేసే పాపం, మనసు తో చేసే పాపం చెవి, కన్నులతో చేసే పాపం మనలెక్కలో నిత్యం పెరిగిపోతుంది.

ఆ మహనీయుని సమక్షములోనే ఇలాంటి దుర్విమర్శలు చేస్తున్నా వారేనాడు మందలించే వారు కాదు. వారికి బదులు తులసమ్మగారు ఎన్ని మార్లు మందలించినా వారాదుర్గుణము మానేవారుకాదు. నేడు మనం శ్రీ స్వామి వారి కృప పొందాలంటే ఈ దుష్టగుణం నుండి మనం ఎంతదూరంగా ఉంటే అంతమంచిది.

శ్రీ స్వామి వారి సంస్థ దగ్గర నుండి అందరినీ విమర్శిస్తున్నాము. ఆత్మ విమర్శ మాత్రమే చేయము. మరి వారి కృప మనకేవిధంగా లభిస్తుంది? నోరు విప్ప కూడదని శ్రీ స్వామి వారు చెపితే ఆ మాట మనం ఆచరించాలి గదా? వారు చెప్పినట్లు చేయకనే మనం వారి కృపపొందటమెలా? కొంతమంది అంటారు - వాళ్ళు నిజంగా చేసే చెడ్డపనులేగదా నేను చెపుతున్నాను. మరి అందులో తప్పేముంది అంటారు. అది ముమ్మాటికి తప్పు గనుకనే శ్రీ స్వామి వారు తన జీవితాంతం అలా ఎవరినీ విమర్శించలేదు.

ఇతరులను విమర్శించడం- పందిమల భక్షణ చేయడం వంటిదని శ్రీ షిరిసాయి అంటారు. శ్రీ స్వామి వారి కృప పొందాలంటే మానసికంగానూ, కంటి ద్వారా, చెవి ద్వారా, నోటి ద్వారా, శరీరం ద్వారా చేసే మన పాపకర్మలు వెంటనే వదలి వేయాలి.

శ్రీ స్వామి వారి సన్నిధి కొచ్చింది పాపము పోగొట్టుకొనేందుకే గాని పాపం సంపాదించుకునేందుకు కాదు గదా? మన బాధలు మానసికంగా ఆ కరుణామూర్తికి విన్నవించుకోవడమే మనం చేయవలసినదల్లా. మరలా మరలా అలా విన్న వించుకుంటుంటే సర్వం చక్కబెట్టగల కరుణా సాగరులు వారు (సాగరమంటే సముద్రమన్న మాట)

"వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది." అని శ్రీ స్వామి వారన్న మాట ఎంత  సత్యమో గదా! గొలగమూడిలో మనకు అనేక ఇబ్బందులు కలిగించి మన పాపం తీసేయ్యాలని శ్రీ స్వామి వారు చూస్తుంటే మనం ఆ ఇబ్బందులు తనకు కలిగించిన వారే దానికి కారణమని మనం వారిని మానసికంగాను నోటితోను, ఒక్కొక్కసారి శారీకంగా కూడా ఎదుర్కొని ఇంకొంచెం పాపం తెచ్చుకుంటుంటే, ఇక మన బాధలను పోగొట్టుకొనేదెలా? శ్రీ స్వామి వారి కృప మనకు అందకుండా మనకు మనమే అడ్డు గోడ నిర్మించుకుంటున్నాము. మనకు కలిగే ఇబ్బందులు, నష్టాలు, కష్టాలు అన్నీ శ్రీ స్వామి వారు మన మంచికే కల్పిస్తున్నారని గట్టిగా నమ్మి చలనం లేని విశ్వాసంతో ఉంటే ఎంతటి ఆనందాన్ని ప్రసాదిస్తారో మనకు తెలిపేదే "దివ్యలీలలు" అనే చిన్న పుస్తకములోని ఏడవ పేజీలో ఉన్న అత్తిమాన్ జేరి ఎల్లమ్మ అనుభవం. ఈమె నేటికీ శ్రీ స్వామి వారి సేవలోనే ఉంది. అట్లాగే గొలగమూడికి వచ్చాక ఏడు సంవత్సరాలు నేను పడ్డ శ్రమలు వ్రాస్తే ఒక పుస్తమే సరిపోతుంది.

"వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది." "సముద్రాల మీద ఈ చూపుకు అడ్డే లేదు" విశ్వాసముతో ఇక్కడకొచ్చి ఏమనుకుంటే అదయ్యేదేగదయ్యా" అని శ్రీ స్వామి వారు చెపుతుంటే- ఆ మాటలు నూటికి నూరు పాళ్ళు సత్యాలని విశ్వసించాలి. అంటే సంపూర్ణంగా నమ్మితే మనం శ్రీ స్వామి

వారి కృప తప్పక పొందగలమని అనుభవపూర్వకంగా మీకు మనవి జేస్తున్నాను. అట్లా సంపూర్ణంగా నమ్మక నా జబ్బు తగుతుందా? అని ఒకచీటి, నా జబ్బు తగ్గదు అని మరొక చీటి వ్రాసి శ్రీ స్వామి వారి సమాధి మీద పెట్టి ఒక చీటి తీసుకోవడం ఎంత అజ్ఞానం? నిజంగా మనకు శ్రీ స్వామి వారి శక్తి సామర్థ్యాల మీద నమ్మకమే ఉంటే "నా జబ్బు తగ్గించు తండ్రీ అని మానసికంగా అడగాలి గాని చీటి పెట్టడం అజ్ఞానమే అవుతుంది.

తమ సేవకులు లౌకికులతో లౌకిక విషయాలు మాటాడినప్పుడు అది తప్పు అని వారికి చెప్పేవారు. "ఈయన మనుషులోకి పోయి వచ్చాడు గంజి నీవు పోయయ్యా" అని నిత్యం తనకు గంజి పోసే సేవ చేస్తున్న సేవకుని సేవను నిరాకరించేవారు. గనుక లౌకిక వ్యవహారాలు చేస్తున్నట్లయిన శ్రీ స్వామి వారి కృప తప్పక పోగొట్టుకుంటామనేది తథ్యం.

మన కష్టాలు తీరేందుకు ఎక్కువ కాలం కొంత మందికి పట్టవచ్చు. ఆయనకు మా మీద ఇంకా దయకలుగలేదే! అని వాపోతాము. మన పాపం కడిగేయాలని శ్రీ స్వామి వారు మనకు కష్టాలు ఎక్కువ చేస్తుంటే వాటిని సంతోషంగా భరించే దానికి బదులు ఆ కష్టాలకు నిమిత్తమాత్రులైన వారిని దూషిస్తూ మన పాపం పెంచుకొంటూ శ్రీ స్వామి వారికి దూరమౌతున్నాము.

శ్రీ స్వామి వారిని చూచి మనం నేర్చుకోవలసిన మరొక ముఖ్య విషయం - నియమ పాలన, ప్రపంచం తల్లక్రిందులైనా సరే, ప్రాణాపాయమైనా సరే ఎట్టి పరిస్థితిలోను తన నియమాన్ని తప్పే వారు కాదు ఉదాహరణకు ఒకసారి శ్రీ స్వామి వారి బృందమంతా మద్రాసు రాష్ట్రంలోని తిరువళ్ళూరు పోతున్నారు. శ్రీ స్వామి వారి సేవకులు తమతో కూడా శ్రీ స్వామి వారు జావత్రాగుటకు వాడే తాటి ఆకు రేక ( దొన్నె) తీసుకు పోవుటకు మరచి పోయారు ఆరోజులలో రైళ్ళు బొగ్గుతో నడుపబడేవి. తిరువళ్ళూరు చేరేందుకు కనీసం ఐదు రోజులు పడుతుందట. మారమధ్యంలో శ్రీ స్వామి వారిని గంజి త్రాగమంటే రేక అడిగారు. మరచిపోయామని సేవకులు చెపితే మూడు రోజులు గంగ ముట్టలేదట. సేవకులేమో దిట్టంగా తింటున్నారు. చివరకు ఒక

రైల్వే స్టేషనులో మకాం వేసి ఎక్కడో కత్తి సంపాదించి తాటాకు రేక కట్టి ఇస్తేనే గంజి త్రాగారట. అన్నపానీయాలకు అంత ఇబ్బంది కలిగినా తాటిఆకు రేకలో జావ త్రాగే తన నియమాన్ని వదలలేదు. ఒకసారి బొంత చెట్టు క్రింద అగ్ని వ్రేలుస్తున్నారు. వర్షం వల్ల నిప్పు ఆరిపోతుంది. కానీ శ్రీ స్వామి వారు మాత్రం ఎంతో పట్టుదలతో చితుకులు వేసి అక్కడే నిప్పు రగిలిస్తున్నారే కానీ ప్రక్కనున్న దేవాలయ వరండాలోకి తన అగ్నిని మార్చుకోమంటే సుతరాము అంగీకరించక "బొక్క పడుతుందయ్యో" అన్నారు. అంటే అర్థమేమిటో అవధూత భోధామృతంలో వివరించబడింది. అంతటి వజ్రసమానమైన నియమ పాలన చేసేవారు. మనలను కూడ అట్టి వజ్రసమాన నియమ పాలన చేయనిదే ఫలితముండదని హెచ్చరిస్తున్నారు. ఇది సాధకులకే గాక, సంసారులకు కూడా గొప్ప మౌనబోధ.

మన వత్తిళ్ళకు లొంగని వైరాగ్యము:- విలువైన చిప్ బ్యాగు ఇస్తుంటే వద్దంటే వద్దన్నారు. శ్రీ స్వామివారి మాట వినకుండా ఒక సేవకుడు ఆ బ్యాగు తీసుకొని అందులో తన గుడ్డలు పెట్టుకున్నాడు. అందరినీ నిద్రపోనిచ్చి ఆ బ్యాగును గుండంలో వేసి కాల్చేశారు. చెప్పిన మాట విననందుకు శిక్షగా ఆ సేవకుని గుడ్డలు గూడా సంచితో పాటు అగ్నిపాలయ్యాయి.

ఇదే విధంగా శ్రీ స్వామి వారు క్రొత్త దుప్పటి ఇస్తుంటే సుతరాము అంగీకలించకుండా వద్దన్నారు. కానీ సేవకులు ఆ దుప్పటి తీసుకున్నారు. శిద్దలయ్య కొండ దగర మండుటెండలో ఆ దుప్పటి తెప్పించి రాళ్ళతో కొట్టి జానెడు వెడల్పు పేలికలు చేయించారు. ఆ పేలికలు జబ్బుల వారికిస్తే జబ్బులు పోతాయని ఆదేశించారు. వత్తిళ్ళకు లొంగని వైరాగ్యమంటే ఎలా ఉంటుందో తన ఆచరణ ద్వారా మౌనంగా బోధించారు. దుప్పటి ముక్కలు చేయడంతో మండుటెండలో సేవకుల కాళ్ళు మాడిపోయాయి. తన మాట విననందుకు అది వారికి శ్రీ స్వామి వారు విధించిన జుల్మానా అన్నమాట.

మాకేమైనా బోధించమని సేవకులడిగితే సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ సాధించమని బోధించారే గాని వివరించమని సేవకులడుగలేదు అడిగినా వారు తన నోటితో ఏనాడు ఎవరికీ వివరించింది లేదు. ఇందులో సంపన్నత్వమంటే భగవత్ గీతలో చెప్పబడ్డ దైవ సంపదలోని లక్షణాలు. అందులో మొదటి లక్షణం భయ-రహితులుగా, నిర్భయంగా జీవించడం. దైవమే తన ఏకైక ఆధారంగా జీవించే వానికి ఇక భయానికి తావేలేదు

సాధారణత్వం:- సహజ సిద్ధమైన నిరాడంబరత. తన సేవకుడైన చలమానాయుని ఐదేళ్ళ బిడ్డ చనిపోతే ఆ శవాన్ని తన భుజాన మోసుక పోయి పెన్నానదిలో పూడ్చిపెట్టి వచ్చిన నిరాడంబరత అది. అదే చలమానాయునికి గొఋతోలి సజవిత్తనాలు చేలో నాటిన సాధారణత్వం అది. ఈ నాటి నకిలీ సాధువులు ఎన్ని జన్మలెత్తినా సాధించలేని సాధారణత్వమది. శ్రీ రామకృష్ణ పరమహంస గారు తన తల వెంట్రుకలనే చీపురుగా చేసి పాకీ దొడ్డు శుభ్రపరిచారట. ఈ మహనీయులందరూ వాచా బోధించకనే సాధారణత్వం ఎలా ఉండాలో తమ దివ్య ఆచరణ ద్వారా భోధించారు.

సద్గురుసేవ:- తమ గురువు సమాది చెందాక అగ్నియే వారి రూపంగా భావించి సేవించడం శాస్త్ర రీత్యా పరిపాటి. అట్టి నియమాన్ని శ్రీ స్వామి వారు ఎంత చక్కగా ఆచరించారో వ్రాసేందుకు సాధ్యపడదు. అన్న పానీయాల కంటే అగ్నియే శ్రీ స్వామి వారికి ప్రీతి పాత్రమైనదని మనందరికీ తెలుసు.

ఇంతవరకు మనం గమనించిన [illegible]లు :-

1. అందరిలోనూ శ్రీ స్వామి వారే యున్నా రన్న దృఢమైన నమ్మకంతో ఇతరులకొరకు శ్రమించడమే శ్రీ స్వామివారి కృప మనకు దక్కేటట్లు చేసే ఏకైకమార్గం.
2. ఇతర వ్యక్తులను గాని పరిస్థితులను గాని విమర్శించకుండా అన్ని వేళలలోను ఆ మహనీయునిపై మనస్సు సంపూర్ణంగా లగ్నం చేయడం.

"వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనం ఉండేది" అన్న శ్రీ స్వామి వారి మాట అక్షరాల సత్యసమ్మతమైయుంది.

ఆ మహనీయ మూర్తి పిలచిన వెంటనే పలుకు తారనే విశ్వాసం ఎందరికున్నది ? ఇది ఎవరికి వారే నిర్ణయించుకోవలసిన విషయము. గూడూరు గాంధీ బొమ్మ సెంటరులో ఉన్న రామ మూర్తి గారి భార్య విశ్వాసము మనందరికీ ఒక చక్కని పాఠముగా ఉంది. డాకరు అనేక పరీక్షలు చేసి ఈమెకు ఆపరేషన్ చేయాలన్నారు. ఈమె పొట్టకు చేయబడే మూడవ ఆపరేషన్ గనుక గ్యారంటీ ఇవ్వలేమన్నారు. వెంటనే ఈ తల్లి శ్రీ స్వామి వారియందు పరిపూర్ణ విశ్వాసంతో పిలిచీ పిలవక ముందే సమాధానం చెపుతాడనే పూర్ణనమ్మకంతో శ్రీ స్వామివారు ఆపరేషన్ చేయించుకోమంటే చేయించ్కుకుంటాను లేదంటే లేదని గొలగమూడికి వచ్చి నలభైరోజులు దీక్షగా ప్రదక్షిణలు చేయమొదలుపెట్టింది. దీక్షా విరమణకు ముందే ఆపరేషన్ చేయించుకోమని శ్రీ స్వామివారు చెప్పారు. ఐదు రాగి నాణాలు, గజనిమ్మ పండ్లు ప్రసాదించారు. వేల సంఖ్యలో పైకమడిగిన డాకరుగారు ఐదువందలే ఆపరేషనుకు తీసుకున్నారు. గజనిమ్మ రసమే ఆమెకు కొన్నాళ్లు ఆహారమైనది. "వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనం ఉండేది" అన్న శ్రీ స్వామి వారి మాట అక్షరాలా నిజమైంది.

మనకేమికావాలో వాటిని శ్రీ స్వామివారు నోటితో చెప్పకుండానే ఆయా పనులు చక్కగా జరిపించి తీరుతారు. అజ్ఞానులమైన మనకు కొన్ని పరిస్థితులలో వారి మాటలు విని అర్థంచేసుకొని ఆచరించే శక్తి ఉండదు. అలాంటప్పుడు ఆ కరుణామయుడు మనలను తన ఇష్టానుసారం నడిపించి తీరుతారు. ఆ క్షణంలో మనకు చాలా కష్టంగా ఉంటుంది. కాని తర్వాత మన ఆనందానికి అవధులుండవు. అలాంటి సమయాలలో అంతా మన మేలునకే అని సంతోషంగా ఉండడమొక్కటే మంచిది.

మా కుమార్తె వివాహం ఇక మూడు రోజులే వుంది. ఒక్క క్షణం తీరిక లేకుండా తిరుగుచున్నాను. ఆరోజు ఉదయం పదిగంటలకు ప్రయాణమై నెల్లూరు పోవాలని మందిరం ముందు నిలుచొని యున్నాను. నెల్లూరుకు పొయ్యే రెండు రూట్లలోని బస్సులు ఒకేసారి వచ్చి నిలుచొని నన్ను బస్సు ఎక్కమని పిలుస్తున్నారు.

ఒక్క రెండు నిమిషములపాటు కండ్లు తెరచేయున్నాను. కానీ ఈలోకంలో లేను. నేను తిరిగి మన ప్రజ్ఞలోకొచ్చేసరికి రెండుబస్సులు వెళ్ళిపోయాయి. మానసికంగా చాలాబాధపడుతూ, ఈడుపు కాళ్ళతో ఇలు చేరాను. ఇల్లుచేరిన వెంటనే రెండు నిమిషాల్లో నాకు కాబోయే అల్లుడు మోటార్ బైక్ మీద నాకొరకు వచ్చాడు. నేను బస్సె ఎక్కి వుంటే ఆయనను కలుసుకునేవీలేలేదు. మమ్ములను కలిపేందుకే శ్రీ స్వామివారు నాకు రెండు నిమిషాలు మన ప్రజ్ఞలేకుండా చేసి బస్సులు తప్పగొట్టారు. ఈ సన్నివేశం చాలా చిన్నదే కావచ్చు. కానీ లోతుగా యోచిస్తే శ్రీ స్వామివారు అనుక్షణం ఎంతో జాగ్రత్తగా మనలను నడిపిస్తున్నారని తెలుస్తుంది. "నేనే సర్వమూ మీకు సమకూర్చుతాను. మీ దృష్టి నాపై నిలపండి" అని భోధిస్తున్నారన్నమాట.

శ్రీ స్వామి వారి యందు సంపూర్ణమైన విశ్వాసంగలిగి యున్నాగాని ఒక్కొక్కప్పుడు కష్టాలు తప్పవు. ఇందుకు కారణం రెండు విధాలుగా ఉండవచ్చు. 1. శ్రీ స్వామి వారి యందు మనకు విశ్వాసమున్నా అందుకు తగిన మోతాదులో మనకృషి ఉండదు. తగువిధంగా కృషిలేకుండానే కేవలం విశ్వాసంతో అవసరాలు గడవడం అనే పద్ధతి శ్రీ స్వామివారు అంగీకరించరు. వర్షం లేనప్పుడు "మనమన్నా కష్టపడి కురిపించుకోవద్దయ్యా" అని వర్షం కురిసినంత వరకు ప్రజల సామూహిక కర్మలను తన తపోశక్తితో క్షాళన చేసేందుకు అన్నపానీయాలు మాని అగ్నిహోత్రంముందు కూర్చున్నారు. గనుక మనసమస్యకు తగు విధంగా కృషిచేయడం ఎంత అవసరమో మనమే ఆలోచించాలి. ఇటు సాధనా పరంగాను అటు లౌకికంగాను కృషి చేయాలి. అది తగు మోతాదులో ఉండాలి.

T. నారాయణ అనే శ్రీ స్వామి భక్తుడు శ్రీ స్వామి వారి ఆజ్ఞమేరకు పాలిటెక్నిక్ చదువుచున్నాడు. చాలా పేపర్లు తప్పిపోయాడు. ఒక పేపరు ఎన్ని మార్లు వ్రాసినా పాసుకాలేదు.

నా ప్రోద్బలముతో మరలా గట్టి కృషిచేస్తున్నాడు. ఇలువదిలి గూడూరులో కూర్చొని చదువుకొనుచున్నాడు. ఆ మార్గాన పోతున్న డిపార్ట్మెంట్ హెడ్ గారు నారాయణ ను చూచి అతనీ దగరకొచ్చి ప్రశ్నలు వ్రాసి పేజీనెంబర్లు గుర్తుపెట్టి ఆప్రశ్నలను బాగా చదవమని చెప్పివెళ్ళాడు. చిత్రంగా ఆప్రశ్నలే పరీక్షలలో రావడం, నారాయణ ఆశలు వదిలేసియున్న ఆ సబ్జెక్టుపాసు కావడం జరిగింది. ఆ హెడ్డు ఆమార్గాన పోవడం నారాయణకు ప్రశ్నలు గుర్తుపెట్టిఇవ్వడం అంతా శ్రీ స్వామి వారి ప్రేరణే. అదే శ్రీ స్వామి వారి మౌన బోధ. కష్టపడనిదే ఫలితం దక్కదు.

2. ఒక్కొక్కప్పుడు మన కర్మరాహిత్యానికి గాను మనలను ఎన్నో కష్టాలకు గురిచేయడం కూడకదు. కాని అవి కష్టాలు గా భావించక అవన్నీ అనుగ్రహానికి గుర్తులుగా భావించి స్వీకరిస్తే మనకెంతటి ఆనందం వస్తుందో చెప్పలేను.

శ్రీ స్వామి వారు ఎక్కడ ఉన్నారు ? అని అడిగితే ప్రశ్నించిన వారి స్థాయిని బట్టి సమాధానము చెప్పవలసి యుంటుంది. "అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోవయ్యా" అని వారిచ్చిన అభయం అక్షరాల నిజం. గనుకనే ఎవరెవరో, ఎక్కడెక్కడో తమ కష్టాలను తమ మనసులో చెప్పుకోగానే వారిని ఆదుకోగలుగుచున్నారు. అనేక మందికి వారికి గలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలిస్తున్నారు. లౌకికమైన సమస్యా పరిష్కారాలు సూచిస్తున్నారు. సర్వభూతహృదయాం తర్వర్తికానిదే అలా చేయలేరు.

1998 జనవరి 1 వతేది. సాయంకాలం మందిరంలో పూజచేసి వస్తున్నాను. జనవరి ఫస్ట్ గనుక తప్పకుండా స్వల్పంగానైనా శ్రీ స్వామివారి ప్రసాదం పెట్టించుకోవాలని తలచాను. నిత్యం ప్రసాదం తీసుకోవడం నాకు అలవాటులేదు. శ్రీ స్వామి వారి తీర్థమే నాకు సంతృప్తినిస్తుంది. ఈ రోజు నేను వెళ్ళే సరికి ప్రసాదము పెట్టేవారు తన స్థానములో లేరు. నేను వచ్చేశాను గాని కొంచెం సేపు ఉండి ప్రసాదముతీసుకొని వచ్చియుంటే బాగుండేది కదా అని నొచ్చుకుంటూనడుస్తున్నాను. వెంటనే శ్రీవారి వాక్కు నా హృదయం లో వినిపించింది. "నిరంతంరం నా ప్రసాదం తింటూనే ఇంకా ప్రసాదం ప్రసాదం అని కొట్టుకు లాడుతావే" కాఫీ, టిఫిను, భోజనం అన్నీ రోజుకు పదిసార్లు సేవించినా అరముంది. కానీ నిరంతరం తినడమేమిటి? నాతల తిరిగిపోతుంది. పదిబారలు నడిచేలోపలనాసమస్యకు పరిష్కారం స్ఫురించింది. పంచ భూతాత్మ స్వరూపాయనమః అని వేలమారు చెప్పినా ప్రయోజనమేముంది. పంచ భూతాలు అంటే గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం గదా. నిరంతరం మనం గాలి పీల్చనిదే జీవించలేము గదా! గనుక నిరంతరం వారి ప్రసాదము మనము స్వీకరిస్తున్నాము గదా! ఈ భావన వంట బట్టించేందుకే శ్రీ స్వామివారు అలా పలికారు. అందుకే ఆచార్య శ్రీ భరద్వాజ గారు అనేక సార్లు శ్వాసను గమనించు అని చెపుతుండేవారు. ఈ దివ్య బోధతో కూడా ఇతర నామాలఅర్థాన్ని కూడా వంటబటించుకోమని శ్రీ స్వామి వారు తన దివ్య మౌన బోధ చేశారనవ్వ మాట.

శ్రీ స్వామి వారు మనంచేసే పూజలోని నామాలతో సంబరపడే రాజకీయ నాయకుడు కాదు. వారు నిజంగా కోరేది మన మనస్సు, కాలము. ప్రతినిత్యం ఒకే కాలంలో కొంత సేపు మన మనస్సును వారి స్మరణతోనింపుకోవాలి.

వారిని స్మరించేందుకు మన మనస్సుకు మంచి ఆలంబనగా మనం చెప్పే అష్టోత్తరంగాని సహస్రనామంగాని సహాయపడుతాయి. ఇందులోని పదాలకు అర్థాలు తెలుసుకొని సాధ్యమైనంత నెమ్మదిగా చెపుతూ ఆ అర్థాన్ని చింతన చేస్తుంటే మనం మన మనస్సును వారి స్మరణతో నింపుకుంటున్నామన్న మాట. అలా మనస్సు వారి నిజతత్వం యొక్క అర్థంతో నిండినప్పుడు క్రమంగా వారి కృపవలన మనలోని రాగ, ద్వేషాలు పలచబడి వారికి తత్వతః దగ్గరౌతామన్నమాట. అందుకే శ్రీ స్వామివారు తన బోధ ద్వారా " నీవు నిరంతరం పీల్చేగాలిని నేనే. అలా పీల్చగలిగే ప్రాణశక్తి నేనే. అవి రెండూ అన్ని జీవులకూ ఒకటే గనుక రాగ ద్వేషాలు అర్థరహితాలని చెబుతున్నారు."

**నేను శ్రీ స్వామి కృప పొందేందుకు ఆచార్య శ్రీ భరద్వాజ గారు నాచేత చేయించిన సాధనలు :**

"నిప్పు దగరున్న వ్యక్తి నాగుడ్డల చెమ్మ పోగొట్టమని" ఆ అగ్నిని ప్రార్థించనక్కరలేదు. అక్కడున్న వేడికి మన గుడ్డల తేమ హరించబడుతుంది. అలాగే మహనీయుల సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన మనము సాధనతో నిర్మూలించుకోలేని దుష్టసంస్కారాలన్నీ వాటికై అవే మన నుండి దూరమౌతాయి. గనుక శ్రీ స్వామి వారు మీ ప్రాంతానికి వస్తే వదిలి పెట్టకుండా సాధ్యమైనంత సేపు వారి సన్నిధిలో ఉండు" అని చెప్పి నేను శ్రీ స్వామి వారి సన్నిధిలో ఎక్కువసేపు ఉండేటట్లు చేశారు. శ్రీ స్వామి వారి సన్నిధిలో ఉన్నంతసేపు మౌనంగా మనసులో నామజపం చేయడం-మనసులో వారి రూపాన్ని ధారణ చేయడం - నామం చెప్పుకొంటూ నీళ్ళు తెచ్చి శ్రీస్వామివారి చుట్టూ చల్లేవాణ్ణి - ఎప్పుడైనా ఒక గుడ్డ ఇస్తే దాన్ని నామస్మరణ తో సబ్బుపెట్టి ఉతికి శ్రీ స్వామివారికి సమర్పించే వాణ్ణి. శ్రీ స్వామి వారి సన్నిది లభ్యం కానప్పుడు మనసులో శ్రీ స్వామివారి రూపం ధారణ చేస్తూ, నోటితో నామం చెప్పుకుంటూ చేతులతో కత్తిపట్టుకొని సన్న పుల్లలుకొట్టి కట్టలు కట్టి భద్రపరచి శ్రీ స్వామి వారు రాగానే వారికా కట్టలన్నీ సమర్పించేది. వ్యవధి చిక్కినప్పుడంతా మహనీయుల చరిత్ర పారాయణ చేస్తుండేది. ఇలా నిరంతరం శ్రీ స్వామి వారిని గూర్చిన చింతనే నన్ను శ్రీ స్వామి వారి చెంత చేర్చిందని నా నమ్మకము.

శ్రీ స్వామి వారి ఆజ్ఞలు అచరించుటే మన ధ్యేయం కావాలి. వారి ఆజ్ఞలు లౌకికుల దృష్టిలో పరమ విడ్డూరంగా ఉండటం తథ్యం. నన్ను వీరు గొలగమూడి లోని కోనేరు దాటిపోతే గాడిదతో సమానమని అన్నారు. లౌకికంగా చూస్తే ఇది చాలా ఇబ్బంది కరమై ఆచరణకు అయోగ్యమైన ఆజ్ఞగా కనిపిస్తుంది. కాని ఆద్యాత్మికంగా ఎంతో మేలు చేయగల ఆజ్ఞ. ఈ ఆజ్ఞను నేను అచరించేందుకు శ్రీ స్వామి వారు నాకిచ్చిన వివరణ ఎంత చక్కగా ఉందో చూడండి.

మాతానాస్థి పితానాస్థి నాస్థి బందు సహోదర .... అన్నారు పెద్దలు. వాళ్ళంతా లేరని కాదు అర్థం. ఈ రూపాలకాధారమైన పరమాత్మే సత్యం. ఆ రూపాలన్నీ నాశవంతమైనవే. గనుక ఆ రూపాలకాధారమైన పరమాత్మ పై మనసు నిలుపు. ఆ రూపాలన్నీ మన నుండి వేరుగా ఉన్నాయని నమ్మి మమకార బంధాలలో తగుల్కోవద్దు. ఋణానుబంధాన్ననుసరించి తారసిల్లిన వాళ్ళందరికీ సంతృప్తిగా బాకీలు తీర్చు. అట్లని నీ నియమాలు, ధ్యేయాన్ని త్యాగం చేయడం ధర్మం కాదు. ఆ పరమాత్మకు బాకీ ఉన్నాను. దానిని నా శక్త్యానుసారం తీర్చాలి. అనే భావనతో మన విద్యుక్త ధర్మాన్ని నిర్వహించడమే కర్మసుకౌశలం అవుతుంది. అదే భావశుద్ది. అలా చేయకుండా మమతానురాగాలతో ప్రవర్తిస్తే జన్మపరంపరలనే విషవలయం లో చిక్కుకుంటాము. మాతానాస్తి, పితానాస్తి అన్న శ్లోకాన్ని తప్పుగా అర్థం చేసుకొని వాళ్ళందరూ లేరని తలచడం, సన్యసిస్తాననడం మంచి పద్ధతి కాదు. ఆ బాకీలన్నీ వడ్డీతో సహా అపరాదం పైకం తో సహా మరుజన్మకైనా తీర్చవలసి వస్తుంది. అయిత నియతోపాక్యానం పునరావృతం అవుతుంది. అందుకే వివేక విచారాలుకల్గి మమతాను రాగాలు లేకుండా బాకీలు తీర్చమన్నారు. ధర్మ బద్ధంగా జీవించు. దైవీసంపదలోని మొదటి లక్షణమైన-భయములేకుండుట-అనే లక్షణం సాధించు. రాకన్ మానవు హాని, వృద్ధుల్ మహాఘోరా రణ్యంబునన్ దాగినన్ అన్నారు "ఎవరెన్ని అడ్డుపెట్టినా జరిగేది జరుగక మానదు. ఎవరెన్ని చేసినా జరుగనిది జరుగదు" అంటారు శ్రీరమణ మహర్షి. సిరచిత్తుడవై కుచేలుడు చెప్పినట్లు జీవించు. ఉంఛవృత్తి (పరిగఏరుకోవడం) మాని భిక్షకు పొమ్మన్న వారితో కుచేలు డంటారు "నా బిడ్డల ప్రారబ్దం అలాఉండి నా లాంటి ఉంఛ వృత్తి గలవాని గర్భవాసాన జన్మించారు. వారు మహారాజుల ఇండ్లలో పుట్టిఉంటే ఈ దురవస్థ ఉండి ఉండదు గదా! వాళ్ళకొరకు నేను నా నియమాన్ని మానుకోలేను. ఈ ఉంఛ వృత్తిలోనే ఎక్కువధాన్యం దొరికేటట్లు భగవంతు డనుగ్రహిస్తే తెచ్చి పోషించనా? అంతె గాని నా నియమాన్ని భంగపరచుకోలేను" అంటారు. అదే నిజమైన వివేకము మరియు భగవంతునిపై విశ్వాసము. కర్మ సిద్ధాంతము పై సంపూర్ణ విశ్వాసమంటే అదే.

నా పై వారికి గల అపార కరుణతో నా కిచ్చిన ఆదేశాన్ని తూ.చ. తప్పక పాటించడమొక్కటే నా విధి. కోనేరు దాటి

పోవద్దని ఆదేశించడం ద్వారా నాకెంతో మేలు చేశారు. దానిని నేను ఇక్కడ మీకు చెప్పలేను. ఉదా. మూడు నెలల నుండి భాధించిన నాసడుగు నొప్పి పై ఆజ్ఞను పాటించమొదలు పెట్టగానే అదృశ్యమైంది. రెండవది ఎన్నడూ లేనంత స్పష్టంగా ఆద్యాత్మిక సత్యాలు మనస్సుకు తట్టడం. వీటి ద్వారా ఆ ఆదేశం శ్రీ స్వామివారిచ్చిన మౌన సందేశమేనని గట్టిగా నమ్మాను.

శ్రీ స్వామి వారు మన మద్య ఉండగనే ఒక రోజు "నీ అన్నం నీవు తిను" అని నన్నాజ్ఞాపించారు. శ్రీ స్వామి వారిసేవకులు ఎంతో దూరం శ్రీ స్వామి వారికి విన్నవించి నేను శ్రీ స్వామి వారి ప్రసాదం తినేందుకు అనుమతి పొందాలని,చూచారు. కానీ శ్రీ స్వామి వారు అంగీకరించలేదు. ఈ ఆజ్ఞ శ్రీ స్వామి వారి సన్నిధిలో మాత్రమే కాకుండా మా ఇంటిలో కూడాఆచరించవలసి వచ్చింది. ఇంటిలో తప్ప మరెక్కడ భోంచేసినా గాని వెంటనే నేను అనారోగ్యానికి గురిఅవుతుండడంవలన ఎక్కడికి వెళ్లినా నా అన్నం నేను వండుకొని తినడం తప్పలేదు. కాని ఇంటిలో మాత్రం ఎవరు వండినా తింటూ ఉండేవాణ్ణి. ఇలా ఏడుసంవత్సరాలు గడిచాక ఒకసారి రెండు నెలలు విపరీతమైన దగ్గు వచ్చింది. ఎన్ని మందులు వాడినా తగలేదు. నేను శ్రీ స్వామివారి ఆజ్ఞకు భిన్నం గా నా అన్నం నేను వండుకొని తిననందువల్లనే నాకీ దగ్గు వచ్చిందని తెలుస్తుంది. కాని నాభార్య నేనలా వేరే వంటచేసుకొని తినేందుకు సుతారాము అంగీకరించలేదు. దగ్గు బాధ భరించలేక ఒక రోజు మా భార్యకు చెప్పకుండా శ్రీ స్వామి వారి సమాధిపైన మూడు చీటీలు వ్రాసి పెట్టాను.

1. నా అన్నం నేనే వండుకొని తినాలి.
2. ఇంటిలో ఎవరు వండినా తినవచ్చు.
3. ఇంటిలో భార్య వంటచేస్తే తినవచ్చు.

మూడు చీట్లు తీసి ఒక ప్లేటులో పెట్టి నా భార్య నే ఒక చీటీ తీయమన్నాను. "నా అన్నం నేనే వండుకొని తినాలి అనే చీటి వచ్చింది" ఆ రోజు రాత్రికి గోధుమ రవ్వ ఉక్కిరి నేనే స్వయంగా చేసుకొని తిన్నాను. శ్రీ స్వామి వారి ఆజ్ఞ ఎంత చిత్రమో గదా! ఆ నాటి నుండి అన్నాళ్ళుగా భాధించిన దగ్గు అంతులేకుండా పోయింది. అది మొదలు నా ఆహారం నేనే వండు కొనితింటు న్నాను. ఎంతో ఆరోగ్యంగా హుషారుగా ఉండగలుగుచున్నాను. శ్రీ స్వామి వారు నేటికీ మన ప్రతి చిన్న కదలికను కూడ జాగ్రత్తగా గమనిస్తూనే ఉన్నారని తెలుసు కొని మనం నడుచుకుంటే ఎంత ఆనందమోచెప్పలేను.

మనం చేసే ప్రతి పనీ వారిసేవగా ఎలా చేయాలో వారు తన అద్భుత మౌన బోధ ద్వారా తెలిపారు.

ఏ వైద్యాలకూ లొంగని నా ఆయాసం జబ్బు కేవలం వారి దివ్య సన్నిధిలో కూర్చునంత మాత్రాన సంపూర్ణంగా తగ్గిపోసాగింది. కృతజ్ఞతాభావంతో నిత్యం నాలుగు ఇడ్లీలు తెచ్చి శ్రీ స్వామి వారికి సమర్పించే వాడిని. వాటిని శ్రీ స్వామి వారు తినేవారు. ఇడ్లీకి బయలుదేరినది మొదలు తిరిగి శ్రీ స్వామి వారి చెంతకు వచ్చిన దాకా వదలకుండా త్రికరణ శుద్ధి గల నామజపంచేస్తుండే వాడిని. ఒకరోజు నా దగ్గర పదిపైసలే ఉంది. దాంతో ఒక ఇడ్లీ తీసుకరావడమా లేక అప్పుచేసి నాలుగిడ్లీలు తేవడమా? అనే యోచనలోనే మార్గమధ్యమంతా గడచిపోయింది. నామజపంచేయలేదు. ఇడ్లీలు తెస్తే కనీసం తాకేందుకు కూడా నిరాకరించారు. ఇడ్లీలు తాకి ప్రసాదం గా ఇవ్వమని శ్రీ స్వామి వారి సేవకులు వారి చెయ్యి పట్టుకుంటే "ఏందయ్యో" అంటూ చెయ్యి లాగేసుకున్నారు.

మరొక రోజు శ్రీ స్వామి వారి బృందం లోనివారి కందరికీ నేనే ఇడ్లీ తెస్తానని ముందుచెప్పి, పప్పునానపోసి రుబ్బి, రవ్వ తడిపిపెట్టినంతవరకునేనే స్వయంగా నామ జపంచేస్తూ కూర్చున్నాను. తెల్లవారి ఇడ్లీ పెట్టి, చట్నీ చేసి శ్రీ స్వామి వారిసన్నిధికి వచ్చేనంతవరకునామజపం చేస్తూతెచ్చాను. కానీ నేను వచ్చేసరికి శ్రీ స్వామి వారికి హోటల్ ఇడ్లీ తెచ్చి పెట్టేశారు. నా మనసు చాలా బాధ పడసాగింది. ఈశ్వరమ్మ నే భక్తురాలు నాలుగిడ్లీలు, చట్నీ శ్రీ స్వామివారికి సమర్పిస్తే చక్కగా భోంచేశారు. ఎంత చిత్రమో చూడండి. హోటల్ ఇడ్లీ తిన్న తర్వాత పదినిముషాలకే మరలా ఇడ్లీ తినడం చాలా ఆశ్చర్యకరమైన

విషయం.

మొదటి సన్నివేశంలో నా ఇడ్లీ తాకను గూడ నిరాకరించుటకు, రెండవ సన్నివేశంలో హోటల్ ఇడ్లీ తినిన పదినిముషాలలోనే తిరిగి నేను తెచ్చిన నాలుగిడ్లీ తినేందుకు కారణమేమి? మొదటి సన్నివేశంలో నేను నామజపం చేయకపోవడము 2వ సన్నివేశంలో ఎంతో శ్రాద్ధాభక్తులతో నామజపం చేయడమే కారణం.

గనుక ప్రతిపని శ్రీస్వామి వారి సేవగా స్వీకరించబడాలంటే ఆపనిని నామజపంతో జోడించి చేయడం ముఖ్యమని శ్రీ స్వామివారు తన మౌనబోధ ద్వారా మనందరికి తెలుపుచున్నారు.

మనం ఆహారము సంపాదించడం, తయారు చేసుకోవడం తినడం కూడా శ్రీ స్వామి వారి సేవ మాత్రమే. ఎట్లా? భగవద్ గీతలో "అహం వైశ్వా నరో భూత్వా" అనే శ్లోకంలో మానవులు భుజించే నాలుగు విధములైన ఆహారాన్ని నేనే ఆకలి అను అగ్నిరూపంలో జీర్ణము చేయు చున్నాను. అని చెప్పారు. పాత్రలు శుద్ధి చేయడం ఇల్లు చిమ్మడం, వంటచేయడం, ఆహారం తినడం అంతా భగవంతుని సేవే అనే భావం ప్రధానంగా ఉండాలి. ఆయా కార్యాలు చేసేటప్పుడు విడవకుండా నామజపం చేస్తుంటే అహంవైశ్వానరో భూత్వా అన్నశ్లోకం - అక్షరాల సత్యమౌ తుంది. లేకుంటే ఆ సేవలన్నీ మన అహంకారానికే సమర్పయామి అవుతాయి" అని శ్రీ స్వామివారి మౌనబోధ బోధిస్తుంది.

శ్రీ స్వామి వారి బోధనా దక్షత ఇటిదని వర్ణించనెవ్వరికీ సాధ్యము కాదు. శ్రీ స్వామివారు శరీరంతో ఉండగనే నన్ను చమురు లేకుండా కాల్చుమని స్వప్నంలో ఆజ్ఞాపించారు. ఆ ఆదేశము యొక్క అర్థమేమిటని అడిగితే వారు వాచా ఏమి చెప్పక మౌనము వహించారు. నాశరీరతత్వానికి చమురు పదార్థాలే గిటవని గనుక చమురులేకుండా ఆహారము తీసుకొనసాగాను. కానీ రస్కు బిస్కెట్లు, బన్‌రొట్టెలు, పొరరొట్టెలు తింటుండే వాడిని. ఒకరోజు స్వప్నంలో "చిన్న తప్పయినా తప్పే" అని పలికారు. నేను చేసే తప్పు నాకుతెలియడంలేదు. గనుక నేను చేసే తప్పు నాకు తెలియజేసి, అలాంటి తప్పు తిరిగి చేయకుండా రక్షించమని ప్రార్థించాను. ఒకరోజొక రొట్టెల బేకరీవాడు గోధుమ పిండిలోవనస్పతి ఆయిల్ పోయడం చూచాను. ఈ పిండితో ఏమి చేస్తారంటే తన బేకరీలోని అన్ని రకాలు చేస్తారనిన్నీ వివిధ రకాలకు వివిధ ఎసెన్సులు కలుపుతారనిన్నీ, మొదట పిండితో నూనె కలుపడం అన్ని పదార్థాలకు తప్పదని చెప్పారు. చమురు లేకుండా రస్కు చేయమంటే అదివీలేకాదని చెప్పాడు. నాటినుండి రస్కు బిస్కెట్లు, బన్ రొట్టెలు , పొర రొట్టెలు కూడా తినడం మానేశాను. అంతకు ముందు పది సంవత్సరాలుగా బాధిస్తుండిన మోకాళ్ల నొప్పులు మాయమయ్యాయి. గనుక వారు వాచా బోధించకుండానే మనకవసరమైన విషయంబోధించే బోధనా దక్షత ఎంత చిత్రమైనదో మనమే యోచించుకోవలెను.గోధుమ పిండిలో నూనె కలపడం నాకు చూపించడమే వారి బోధనా దక్షత. ఇది మాటలకందని మౌన బోధకదా!

1983 వ సంవత్సరంలో "నీఅన్నం నీవు తిను" అన్న శ్రీ స్వామి వారి ఆజ్ఞను ఉలంఘించిన కారణంగా తీవ్రంగా ఆయాసము, దగు. చలి బాధకు గురిఅయ్యాను. అన్ని రకాల వైద్యాలు విఫలమయ్యాయి, డాకరంతా మద్రాసుకుపొమ్మని ఏకగ్రీవంగా తీర్మానించారు. గొలగమూడి వచ్చి శ్రీ స్వామి వారి సమాధికి నమస్కరించి మద్రాస్ పోదామని బస్సు ఎక్కినది మొదలు ఆరోగ్యం బాగుపడటం గొప్ప విచిత్రము. మూడు రోజులు గొలగమూడి లో ఆరోగ్యంగా ఉండి కలిచేడు వెళ్ళేందుకు ప్రయాణము కాగానే తిరిగి అనారోగ్యానికి గురిఅయ్యాను. మిత్రుల సలహా పై నిత్యం ఉద్యోగంచేసి రాత్రి నిద్రచేసేందుకు గొలగమూడి వస్తానని చెప్పుకోగానే అరోగ్యం బాగుపడింది. అదేవిధంగా నిత్యం గొలగమూడి, కలిచేడు తిరిగి ఉద్యోగం చేస్తున్నాను.

1991 ప్రాంతంలో ఒంగోలులో గురుదేవులు ఆచార్య శ్రీ భరద్వాజ గారి గృహనిర్మాణం జరుగుతుంది. ఆ పనిలో నా సేవ సమర్పించాలని మూడు నెలలు నేను శ్రీ స్వామి వారి కిచ్చిన మాట తప్పిపోయి ఒంగోలులోనే ఉండి పోయాను. నా దగ్గర రైల్వే సీజన్ టికెట్టు ఉంది. నిత్యం గొలగమూడి వచ్చే

అవకాశం ఉండి కూడా అశ్రద్ధ కారణంగా అక్కడే ఉండిపోయాను.

అన్నింటికంటె గొప్ప పాపం గురుద్రోహం. అంటే గురువు గారికిచ్చిన మాట తప్పడం. నిత్యం గొలగమూడికి రాకుండా ఒంగోలులో ఉండడమే నేను చేసిన గొప్పపాపం. అందుకు శిక్షగా మూడునెలలు తిరిగి ఆయాసంతో తీవ్రంగా బాధ పడ్డాను. అంతవరకు ఆయాసం గల రోగులు తాళ్ళుపట్టుకొని వ్రేలాడుతారని విన్నానేగాని అలాంటి బాధ నేనెరుగను. కాని ఇప్పుడు అది కూడా అనుభవించాను. నేను కిటికీ కమ్ములు పట్టుకొని వ్రేలాడే వాణ్ణి. వైద్యాలకు మూడువేల రూపాయల కు పైన ఖర్చు పెట్టాను. నాశిక్ష పూర్తయింది కాబోలు. మూడునెలల తర్వాత మాత్రమే జబ్బుకు కారణం నా హృదయంలో మెరిసింది. "స్వామి నేను ఇచ్చిన మాట ప్రకారం రాత్రికి గొలగమూడిలో నిద్ర చేయకుండా ఒంగోలులో ఉండడమే నా జబ్బుకు కారణమైతే నన్ను క్షమించి ఇంతటితో వదలండి. ఈ తప్పు తిరిగి మరెప్పుడూ చేయనని చెంపలేసుక్కున్నాను".

మన ఊహకు, మేధస్సుకు అందని విధంగా ఆ రాత్రినుండి నా ఆయాసం అంతులేకుండా పోయింది. నాటి నుండి నేటి వరకు ఆరోగ్యంగా ఉన్నాను. నా జబ్బుకు కారణం మూడు నెలల తర్వాత నా హృదయంలో మెదలడమే శ్రీ స్వామి వారి మౌన బోధ. ఇట్టి దివ్య బోధతో మనలనుద్దరించడమే వారు వచ్చిన పని కాబోలు నమోనమస్తే శ్రీ సద్గురురాయా!

<u>మాటల కందని మౌన బోధ</u>

నాగుల వెల్లటూరు వాస్తవ్యుడైన శ్రీరాములు నాయుడు గారు పుల్లనిమ్మపండు కోసి శ్రీ స్వా మి వారి పటానికి నివేదించారు. కాని ప్రసాదం గా ఆ నిమ్మ దబ్బ తినలేదు. ఇంటి నుండి పేల పిండి పంపితే ఒక ముద్ద రాత్రికి ఉంచి ఒకముద్ద శ్రీ స్వామివారి పటానికి నివేదించాడు. ఇప్పుడు ప్రసాదంగా కొంచెం పేలపిండి నోటిలో వేసుకుంటే అది పుల్లనిమ్మ పండులాగా అమిత పుల్లగా ఉంది. పేలపిండి ఇంత పుల్లగా ఉంది ఏమిటబ్బా అనుకొని రాత్రికి దాచిఉంచిన పేలపిండినోట్లో వేసుకుంటే అది తియ్యగా ఉంది. వెంటనే శ్రీ స్వామి వారు శ్రీ రాములు నాయుడు గారి హృదయంలో పలికారు "నాకైతే పుల్ల నిమ్మ కాయ పెట్టావే ఆ పులుపు నీవు తినగలవా?" అంటే మనం ప్రీతితో తినేదాన్నే శ్రీ స్వామి వారికి నివేదించాలని అర్థం అన్నమాట.

ఈ భక్తుడే ఒక రోజు గోవు పంచితం తనగుడిసెలో చల్లుతున్నాడు. కొంచెం పంచితం శ్రీ స్వామి వారి పటం మీద పడింద్ది. పంచితం పడితే మంచిదేలే అని తుడవకుండా వదిలేశాడు. కొంతసేపు తర్వాత తనపైన ఏదో ద్రవం పడితే బల్లి మూత్రం విడిచిందని పైనచూచాడు అక్కడేమీ లేదు. ఆద్రవాన్ని వాసన చూస్తే అది గోవు పంచితం అయిఉంది. వెంటనే తుడిచేసుకున్నాడు. వెంటనే శ్రీ స్వామివారు శ్రీరామయ్య ఆత్మలో పలికారు "నీపైన పంచితం పడితే తుడిచేసుకున్నావే మరి నా పైన పడినా అంతే గదా?" అంటే నా పైన పడితే తుడవకుండా వదిలేశావే? అని అడిగారన్నమాట.

ఈ రెండు అనుభవాల వలన శ్రీ స్వామి వారు మన కొక చక్కని బోధ చేయుచున్నారు. శ్రీ స్వామి వారికి మనం చేసే ఏ సేవైనా సరే ఆ సేవను మనకు చేసుకుంటే ఎలా చేసుకుంటామో అలాగే చేయాలని బోధిస్తున్నారు. విపరీతంగా వేడిగా నున్న పదార్థాలు మనం తినలేము గనుక అలాంటి వేడి పదార్థలు నివేదించరాదని, అట్లానే తాంబూలం గాని ఇతర ఉపచారాలుగాని ఉండాలని శ్రీ స్వామివారు తన మౌనబోధ ద్వారా బోధిస్తున్నారు. టెంకాయలు కొట్టి నేల పై ఉంచి నివేదించడం వంటి సేవల విషయంలో గూడా ఈ బోధ ఉపకరిస్తుంది.

కంసాలి రాజయ్యకు ఇంజక్షన్ రియాక్షన్ ఇచ్చింది. కారులో నెల్లూరు తీసుకపోతున్నారు. కారుకు ముందు నాలుగు బారల దూరంలో శ్రీ స్వామి వారు పోతున్నట్లు రాజయ్యకు మాత్రమే కనిపించింది. టైం అయిపోయిందిగమక గవర్నమెంటు ఆసుపత్రిలో డాక్టర్లు ఉండరని అనుకున్నారు. కాని చిత్రంగా తన డ్యూటీ టైం అయిపోయాక ఒక గంటసేపు తన కుర్చీలోనే కుర్చుండి పోయాడు డాక్టరు గారు. రాజయ్య వాళ్ళు రాగానే వైద్యం చేసి తన డ్యూటీ టైం అయిపోయాక గూడ ఒక గంట

సేపు తాను తన కూర్చిలో ఎందుకు కూర్చోనుండి పోయాడో తెలియలేదని వాళ్ళకొరకే భగవంతుడు తననలా కూర్చోబెట్టారని ఆ డాక్టర్ స్వయంగా చెప్పారు.

మనం శ్రీ స్వామి వారిని ప్రార్థించక పోయినా సరే ఏ సమయానికి మనకేది మంచిదో అది శ్రీ స్వామి వారే మనకు సమకూర్చుతారని తన మౌన బోధ ద్వారా తెలుపుతున్నారు. అయితే శ్రీ స్వామి వారిని సంపూర్ణ విశ్వాసంతో ఆశ్రయించవలసిన ఏకైక కర్తవ్యం మన మీద ఉంటుంది.

నన్ను కొందరు శకునాల పక్షి అంటే మరికొందరు సెంటిమెంటల్ మనిషి అనడం కద్దు. వాళ్ళావిధంగా అ నేందుకు కారణం లేకపోలేదు. నేను ప్రయాణమై ఇలు దాటే ముందు శ్రీ స్వామి వారు నాకేదో ఒక విధంగా తెలిపిన ఆదేశాన్ని బట్టి నిలువునా ప్రయాణం మానుకోవడమే అందుకు కారణము. అట్లా అనేకసారు జరిగాక మిత్రులు బంధువులు ఆవిధంగా అనడం పరిపాటైపోయింది. నాకు వచ్చిన సంకేతాలు-ప్రయాణాలు ఆపడం గూర్చి పూజ్యపాదులు శ్రీ భరద్వాజ మాష్టరు గారికి చెప్పాను. బాహ్యమైన సంకేతాల కంటే ఆంతరంగిక మైన పరిస్థితిని బాగా గమనించి నీకు చీకాకుగా మనసు గందరగోళంగా ఉంటే ప్రయాణం మానుకోమన్నారు. ప్రతిసారి బాహ్యసంకేతాలు, ఆంతరంగిక పరిస్థితి ఒకే విధంగా ఉండటంతో నేను తరచుగా ప్రయాణాలునిలిపేసేవాడ్ని.

పరమ దయానిధి యైన శ్రీ స్వామి వారు ఎంతో చిత్రాతి చిత్రంగా తన బోధను మనకందించి మనకు మంచి చేయాలని చూస్తారు. ఆ మంచి మనం పొందాలంటే మనం వారి మాట వినాలి, ఆచరించాలి గదా!

మా కుమార్తెకు హుబ్లీ డివిజన్ లోని హుటిగీ అనే చోట రైల్వేలో పర్మనెంట్ ఉద్యోగం వచ్చింది. రైల్వే టిక్కెట్లు రిజర్వ్‌చేసుకొని విజయవాడనుంచి ఇక అరగంటలో వెళ్ళబోతాము. వెళ్లవద్దని శ్రీ స్వామివారి సంకేతం ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. నాకు బొత్తిగా కాళ్ళు ఆడడం లేదు. మా కుమార్తె ఇంతసెంటిమెంటలైతే జీవితం నడిచే మార్గమే లేదని మా అమ్మను తీసుకుని తాను ఒక్కటే వెళ్ళిపోతానని నేను రానక్కరలేదని మొండికేసింది." "మీఆదేశాన్ని నేనొక్కడినే పాటించి ప్రయోజనం లేదు. నేను ప్రయాణం సాగిస్తున్నాను మీఇష్టము" అని హుబ్లీ వెళ్లాము. మేము మొదట పాస్ పోర్టు సైజు ఫోటోతో అప్లైచేసిన అప్లికేషన్ సికింద్రాబాద్ నుండి హుబ్లీకి రావలసి ఉంటే అదిరాలేదు. వారంరోజులు హుబ్లీలో పడరాని పాట్లు పడుతూ కాలంగడిపాను. తీసుకవెళ్ళిన డబ్బంతా ఖర్చయిపోయింది. "నీమాట విననందుకు మంచి శిక్షజరిగింది స్వామీ, ఈ రోజు తిరిగి ఇంటికి పోతున్నాము" అని చెప్పుకొని మద్యాహ్నం పన్నెండుగంటలకు రేణిగుంట రాబోతున్నాము. మా కుమార్తెకు నా సెంటిమెంటలిజం ఏమిటో బాగా తెలిసివచ్చింది. అప్పుడు శ్రీ స్వామి వారు తిరిగి నా సహాయార్థం కల్పించుకున్నారు. ఒక టెలికమ్యూనికేషన్ రైల్వే ఇంజనీరుతో అనుకోకుండా పరిచయమేర్పడడం, ఆయన మమ్ములను తన బంగ్లాలో ఉంచుకొని పన్నెండు గంటల లోపల సికింద్రాబాద్ నుండి మా అప్లికేషన్ తెప్పించి మాపని పూర్తి చేశారు. సికింద్రాబాద్ లో అందరి అప్లికేషను రిజిష్టరు పోస్టులో పంపారు. మా అప్లికేషన్ పంపేలోగా ఆ గుమస్తాను ఎవరో టీకి తీసుకవెళ్ళారు. మా అప్లికేషన్ ఫైల్స్ మధ్య పడిపోయింది. అటాగే గత ఇరవై రోజులుగా ఉండిపోయింది. ఇంజనీరు గారు కలుగజేసుకొని ఫోన్ చేశాక ఆగుమస్తా స్వయంగా వచ్చి హుబ్లీలో ఆ కాగితం ఇచ్చి వెళ్లాడు.

శ్రీ స్వామి వారి మాట విని విజయవాడ లోనే ప్రయాణం ఆపి మరు రోజు వచ్చి ఉంటే ఇంత శ్రమ ఉండదు. ఏదోవిధంగా ఆ కాగితం ఆ గుమస్తా చేతికి తగిలి సకాలంలో హుబ్లీ వచ్చిఉండేది. అయితే మా కుమార్తె ఈ అనుభవంతో నన్ను సెంటిమెంటల్ మనిషిగా లెక్క చేయడం మానేసింది. నాకు కూడా శ్రీ స్వామి వారిపై విశ్వాసం చెప్పలేనంతగా పెరిగింది. మౌన బోధ అంటే ఎలా ఉంటుందో మరొకసారి చూపించారు.

ఖమ్మం జిలా, దమ్మపేట వాస్తవ్యులు మా మిత్రుని భార్య శ్రీ స్వామివారు తనకు నూతన జీవితం ప్రసాదించిన దివ్యానుభవాన్ని వివరిస్తున్నారు. నలభై రోజులు శ్రీ స్వామివారి

సన్నిధిలో ఉండాలని వచ్చిన ముమ్ముల్ని నూట ఇరవై రోజులు ఉంచుకొనడంలో తన దివ్య మౌన బోధను శ్రీ స్వామి వారు ఉపయోగించడమే చిత్రము.

నాకు గత పదహారు సంవత్సరముల నుండి (1982) అనారోగ్యంగా ఉంది. లక్ష రూపాయలకు పైన ఖర్చు పెటాను. హైదరాబాదు, గుంటూరు, రాజమండ్రి, తాడేపల్లి గూడెం మొదలైన చోట్ల పేరు మోసి డాక్టర్లందరి వద్ద వైద్యం చేయించాను. ఎన్నో ఎక్సురేలు, రక్తపరీక్షలు, మందులు వాడినా ఏ మాత్రమూ నయం కాలేదు. మోకాళ్ల క్రిందనుండి పాదముల వరకు విపరీతమైననొప్పులు, పాదాలు తిమ్మెర్లు ఊపిరాడక ఎగరొప్పుతో బాధపడేదాన్ని. పాదాలమీద చన్నీళ్ళు పోస్తే కొంత ఉపశాంతిగా ఉండేది. కాని ఎంతసేపని అలా పోస్తుంటాము. పదిరోజులు మంచాన ఉంటే ఇరవై రోజులు గోడపట్టుకుని నడిచేది. ఇంటెల్లపాదికి నేనొక సమస్యగా తయారయ్యాను. దాటింపులు, శాతబడులు, మంత్ర తంత్రాలు అన్నీ నిష్ఫలమయ్యాయి. ఒక మంత్రగాడు మా మిద్దె మెట్లుక్రింద త్రవ్వి భూమిలో నుండి ఒక బొమ్మ, రాగిరేకు, గాజులు వగైరా తీశాడు. కానీ నా ఆరోగ్యం చక్కబడలేదు. నా రెట్టలు, కాళ్ళ నుండి ముండు తీశారు. అవినా శరీరంలోకి ఎలా వచ్చాయో తెలియదు. ఇలాగే పదహారు సంవత్సరాలు గడిచాయి. చివరకు ఒక భక్తుని సలహాపై చివరి ఆశగా గొలగమూడి వచ్చి శ్రీ స్వామి వారిని శరణు జొచ్చాను. స్వయంగా వంటచేసుకొని తింటూ పారాయణ ప్రదక్షిణలు చేస్తుంటే క్రమంగా తగ్గసాగింది.

ఒక రోజు నేను చనిపోతానన్నంత తీవ్రంగా జబ్బు తిరగబెట్టింది. శ్రీ స్వామి వారి కృపవలన ఒక గంటలో తగుముఖం పట్టి క్రమంగా బాగైంది. ఒక రోజు రెండు గంటలసేపు మందిరంలో మనలోకం లేకుండా ఉన్నాను. ఆసమయంలో నామనోనేత్రానికి గోచరించే దివ్యమైనముగ్గుల లోనికి రమ్మని ఎవరో ఆహ్వానిస్తుంటే నేను రానని మొండికేస్తున్నాను. చివరకు జటాజూటమున గంగను ధరించిన ఈశ్వరుడే కనిపించి ముగ్గులోనికి రమ్మని నన్నాహ్వానించారు. నేనలాగే వెళ్లాను. నన్ను అనంత పద్మనాభుని వ్రతం చేసుకోమని పరమేశ్వరుడాదేశించారు.

ఒకరోజు గొలగమూడి లోని విఘ్నేశ్వరాలయానికి వెళాను. అక్కడ శ్రీ అక్కల్ కోట స్వామి వారు శ్రీ భరద్వాజ మాష్టారు గారిని పూల పల్లకిలో కెక్కించుకున్న దృశ్యం గోచరించింది. మరొకసారి షిరిడీ సర్వోబా వాడీ అంతా దృశ్యరూపంగా గోచరించాయి.

మరొక రోజు శ్రీ స్వామి వారిమందిరంలో నా ఆరోగ్యం నయం చేయలేదని నిష్టూరాలాడుతున్నాను. అప్పుడే ధనుర్ధారియైన శ్రీ రాముడు సమాదులవైపు పోయి నట్లు, సీతమ్మ వారు వచ్చి శ్రీ స్వామివారి విగ్రహంలో అదృశ్యమైనట్లు దర్శనమైంది. ఎవరో నన్ను కోనేటిలో స్నానం చేయమన్నారు. ఆ దృశ్యంలోనే స్నానం చేశాను. మరు రోజునుండి నాఆరోగ్యం మెరుగుకాజొచ్చింది.

మొదటి నలభై రోజులు పూర్తికాగానే మావారిని వచ్చినన్ను తీసుకెళ్ళమని జాబు వ్రాశాను. వెంటనే నాకు జబ్బు తిరగబెట్టింది. మరొక నలభైరోజులున్నాక నాభర్తరూపంలో శ్రీ స్వామివారు మరొక మండలం ఇక్కడే ఉందామని చెపుతున్నారు. అలాగే మా వారు వచ్చారు. రాగానే వారికి అనారోగ్యమయింది. మూడవ మండలం కూడా ఇదరమూ శ్రీ స్వామి వారిని సేవించి వెళ్ళాము. శ్రీ స్వామి వారి కృపవలన ప్రస్తుతం ఆరోగ్యంగాఉన్నాను. వీరికి జీవితాంతం ఋణగ్రస్తురాలను.

భగవంతుడు మన నుండి నిజంగా కోరేది

1. సత్యం, ధర్మం తప్పకుండా జీవితయాత్ర సాగించడం, సద్గురువులను సేవించడం.
2. మన కాలము, మనస్సు, నిత్యం కొంత సేపైనా వారికి సమర్పించడం.

మన మనస్సును సమర్పించాలన్నా అది మొదట మొదట సాధ్యముకాదు. నిత్యం ఒకే కాలంలో మనం మన కాలాన్ని శ్రీ స్వామి వారి సేవకు సమర్పిస్తుంటే మన పై గల ప్రేమతో వారే మన మనస్సును కూడా నిశ్చలంచేసి తన వైపు మళ్లించుకుంటారనేది నా అనుభవము. మనందరము తల్లికి దగ్గ బిడ్డలముగా

బ్రతికే టట్లుచేయమని శ్రీ స్వామి వారిని ప్రార్థిద్దాము.

## శ్రీ స్వామి వారి దివ్య సూక్తులు

1. బ్రేవ్‌మని త్రేపే వాడికి కాదయ్యా, ఆకలైకొంగు పట్టేవారికి అన్నం పెట్టాలయ్యా.
2. "సంపూర్ణ విశ్వాసంతో ఇక్కడకొచ్చి ఏదనుకుంటే అది అయ్యేదే గదయ్యా.
3. "అన్ని జీవులలో వెంకయ్య వున్నాడని రాసుకో" అది ప్రతి ఒక్కరికి అనుక్షణము గుర్తుండవలసిన విషయం-సదురుడు విశ్వరూపుడనీ సర్వప్రాణులను వారేపరివేష్టించి యున్నారని, ఏ ప్రాణిని ఆదరించినా, బాధించినా అది సదురునికే చెందుతుందనీ అనుక్షణం గుర్తుంచుకొని జీవితాన్ని సాగిస్తేగురుకృప సదా మనకు లభిస్తుంది".
4. "అందరికీ పంట పండించాను, దాన్ని దొంగలుపడి దోచుకోకుండా చూచుకోండి" మనలోని దుర్గుణాలే దొంగలు.
5. "వెంకయ్య పేరు మీద పిడికెడు మెతుకులు పెట్టిన వారికీ తెచ్చిన వారికి వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా"
6. "సన్యాసులు ధర్మంగా ఉండటంలో గొప్పేముందయ్యా" సంసారంలో ధర్మంగా ఉండటమే గొప్ప"
7. "వడ్డీ విషయంలో కూడా ధర్మంగా ఉండాలయ్యా"
8. "పావలా దొంగిలిస్తే పది రూపాయలు నష్టపోతుండ్లాయ్యా" (అంటే నలబైరెట్లు)
9. తప్పుచేసిన సేవకులను శ్రీ స్వామి వారు మందలించలేదని తలచిన వారితో "పొయ్యే వాళ్ళను పోనిచ్చేదే గదయ్యా? అన్నారు.
10. ముందు ముందు తెడ్డు తగలని అన్నం తింటారయ్య అన్నారు. (ఇప్పుడు ప్రెజర్ కుక్కర్లు వచ్చాయి)
11. "ఆశబోతే అంతా పోతుందయ్యా"
12. "దారం తెగిపోకుండా చూచుకుంటే నేనెప్పుడూ మీ తోటే ఉంటానయ్యా"

## ప్రతినిత్యం గొలగమూడిలో మూడు వేళలా పూజానంతరము పాడే హారతి పాటలు

1. మంగళం గురుదేవాయ మహనీయగుణాత్మనే
సర్వలోకశరణ్యాయ సాధురూపాయ మంగళం
మంగళం వేదవేద్యాయ మేఘశ్యామలా మూర్తయే
పుంసాం మోహన రూపాయ పుణ్య శ్లోకాయమంగళం
రామచంద్రాయ మంగళం రామకృష్ణాయమంగళం
గురుదేవాయ మంగళం సద్గురుదేవాయ మంగళం.

2. స్వామి వెంకయార్యాయ గొలగమూడి వాసాయ
మామకాభీష్టదాయ మహిత మంగళం
లోకనాధాయ భక్తలోక సంరక్షకాయ నాగలోక
పూజితాయ నవ్యమంగళం ||స్వామి||
భక్తబృంధవందితాయ బ్రహ్మస్వరూపాయ
ముక్తిమార్గ బోధకాయ పూజ్య మంగళం
సత్య తత్వ బోధకాయ సాధురూపాయతే
నిత్యమంగళదాయ కాయ నిత్య మంగళం ||స్వామి||

నోట్ : శ్రీ స్వామి వారికి దక్షిణపంపేవారు - ది రిసీవర్ భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, హ్యూమానిటేరియన్ మిషన్, గొలగమూడి (పి.ఐ.), వయా- సర్వేపల్లి, నెల్లూరు జిల్లా, ఎ.పి. 524321 అడ్రసుకు పంపమనవి. వ్యక్తుల పేర్లతో పంపవద్దు.